డెల్టాలో పాల విప్లవం

- జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాల సేకరణ
- మూడు మండలాల్లో రోజుకి 1000 లీటర్ల పైనే..

పాలకొల్లు అర్బన్: రైతులు విక్రయించే పాల ద్వారా అధిక ఆదాయం పొందాలనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ప్రారంభించింది. దీనికి డెల్టాలోని నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి మండలాలతో పాటు తాడేపల్లిగూడెంలో గతేడాది డిసెంబర్ 21న ఈ కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి పాలు సేకరించి గిట్టుబాటు ధర అందిస్తున్నారు. రైతుల నుంచి సేకరించిన పాలను అమూల్ సంస్థ కొనుగోలు చేస్తోంది. ప్రతీ పాల వెల్లువ కేంద్రంలో ఒక పాలమిత్రను నియమించి పాలు సేకరిస్తున్నారు. దీనికి అవసరమైన పాల సేకరణ మెషీన్, కంప్యూటర్, హెనవైజర్, ప్రింటర్, ఇన్వర్టర్, బ్యాటరీ ప్రభుత్వం అందజేసింది. పాలకొల్లు మండలంలో శివదేవునిచిక్కాల, చింతపర్రు, అరట్లకట్ల, కాపవరం, వెలివెల, ఆగర్తిపాలెం గ్రామాల్లో జగనన్న పాల వెల్లువ కేంద్రాలను ప్రారంభించారు. అలాగే యలమంచిలి మండలంలో చించినాడ, యలమంచిలి, కొంతేరు, శిరగాలపల్లి, దొడ్డిపట్ల, ఏనుగువానిలంక గ్రామాల్లో, నరసాపురం మండలంలో కొప్పర్రు, సరిపల్లి, సీతారామపురం, లక్ష్మణేశ్వరం, యర్రంశెట్టివారిపాలెం, సారవ, ఎల్‌బీ చర్ల గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి పాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం మూడు మండలాల్లోనూ 20 పాల కేంద్రాల ద్వారా ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా కలిపి 525 మంది రైతుల నుంచి 1050 లీటర్లు పాలను సేకరించి నరసాపురంలో అమూల్ సంస్థ ఏర్పాటు చేసిన బల్ మిల్క్ సెంటర్‌కు తరలిస్తున్నారు. రైతులకు సరాసరి లీటరుకి రూ.70ల నుంచి రూ.82లు ధర లభిస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో విడిగా పాలు పోసుకోవడం లీటరుకి రూ.60లు మాత్రమే ధర లభించేదని రైతులు వివరిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల అధిక ఆదాయం పొందుతున్నామని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పాలకొల్లు మండలం కాపవరంలో పాల వెల్లువ కేంద్రంలో రైతుల నుంచి పాలు సేకరిస్తున్న పాలమిత్ర

నరసాపురం డివిజన్‌లో సేకరిస్తున్న పాల వివరాలు....

మండలం	ప్రారంభించిన కేంద్రాలు	సేకరిస్తున్న పాలు	రైతులు
పాలకొల్లు	06	400 లీటర్లు	235
యలమంచిలి	07	300 లీటర్లు	150
నరసాపురం	07	350లీటర్లు	140

రోజుకి 4 లీటర్లు పోస్తా.



నాకు రెండు పాడి గేదెలున్నాయి. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నాలుగు లీటర్లు జగనన్న పాల వెల్లువ కేంద్రంలో పాలు పోస్తున్నాను. నాకు లీటరుకి రూ.81లు గిడుతోంది. మేత రేట్లు పెరిగినా ప్రభుత్వ చర్యల వల్ల ఉపాధి పొందుతున్నాను.

– తమ్మినీడి వెంకటేశ్వరరావు, పాడి రైతు, శివదేవునిచిక్కాల

సరైన ధర అందుతోంది



పాల కేంద్రంలో పాలు పోయడం వల్ల సరైన ధర గిడుతోంది. రోజూ రెండు లీటర్లు పాలు పోస్తున్నాను. నాకు ఒక పాడి గేదె ఉంది. లీటరుకి రూ.75 వస్తుంది. పాలను విడిగా అమ్ముకోవడం వలన డబ్బులు చిల్లరగా ఖర్చు అయ్యేవి. ప్రస్తుతం 15 రోజులకు ఒకసారి డబ్బు చెల్లించడంతో ఇంటి అవసరాలకు ఉపయోగపడుతున్నాయి.

– వర్ధనపు విజయ్‌కుమార్, రైతు, ఎస్.చిక్కాల

సబ్సిడీపై గేదెలను అందించాలి



పాల ఉత్పత్తి పెంచడానికి సబ్సిడీపై పాడి గేదెలను అందించాలి. రైతులు పాడి పశువులను పోషించడం ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో జగనన్న పాలవెల్లువ కేంద్రాలను ప్రారంభించి రైతులకు లీటరు పాలకి గిట్టుపాటు ధర అందించడం ఆనందంగా ఉంది.

– మోపిదేవి శివశంకరం, రైతు, ఎస్.చిక్కాల

కొత్తపేటలో జగనన్న సమగ్ర భూ సర్వే


కొత్తపేటలో జగనన్న సమగ్ర భూ సర్వేను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ఎం సూర్యతేజ

పాలకొల్లు అర్బన్: జగనన్న సమగ్ర భూ సర్వే వల్ల వందేళ్ల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుందని సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. పాలకొల్లు మండలం కొత్తపేటలో శుక్రవారం జగనన్న సమగ్ర భూ సర్వే డ్రోన్ ప్లైని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నరసాపురం డివిజన్‌లో మొదటిసారిగా పాలకొల్లు మండలంలోని కొత్తపేట, దిగమర్రు, పెదమామిడిపల్లి, గోరింటాడ, చందపర్రు, సగంచెరువు గ్రామాల్లో డ్రోన్ సహాయంతో సర్వే ప్రారంభించామన్నారు. వందేళ్ల తరువాత భూములు రీ సర్వే సమగ్రంగా చేపట్టామన్నారు. రైతులు పూర్తిగా ఈ సర్వేను వినియోగించుకుని తమ భూముల వివరాలను సరిచూసుకోవాలన్నారు. డ్రోన్ ఆకాశం మార్గంలో ఎగిరి ప్రతీ గ్రామానికి సంబంధించి శాటిలైట్ సర్వే మ్యాప్‌ను అందిస్తుందన్నారు. ఈ మ్యాప్ ఆధారంగా రైతుల భూముల వివరాలు సరి చూసుకోవచ్చన్నారు. భూముల రికార్డులు సక్రమంగా ఉంటే భూ సమస్యలు తలెత్తవన్నారు. అలాగే సివిల్ తగాదాలు కూడా శాశ్వతంగా పరిష్కారమవుతాయని రైతులకు సూచించారు. అయితే సబ్ కలెక్టర్ సర్వేను పరిశీలిస్తున్న క్రమంలో సాంకేతిక సమస్యతో డ్రోన్ కిందపడివిరిగిపోవడం గమనార్హం. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ టి.నాగలత, సర్పంచ్‌లు కవురు భారతి, రాపాక నగేష్ కరుణాకర్, ఉప సర్పంచ్ కొండేటి మల్లికార్జున రావు, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యభాస్కర రావు (రాజా), వీఆర్వో బళ్ల రాజు, ఎంపీటీసీ సభ్యుడు పెదపాటి వెంకటరత్నం పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

పాలకొల్లు సెంట్రల్: వివిధ ప్రాంతాల నుంచిరైల్వే సౌకర్యాల కోసం వస్తున్న ఫిర్యాదులను అతి త్వరలో పరిష్కరించే కృషి చేస్తానని విజయవాడ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యూసీసీ) సభ్యులు జక్కంపూడి కుమార్ తెలిపారు. గురువారం విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) శివేంద్ర మోహన్‌తో జరిగిన వర్చువల్ సమావేశంలో పలు అంశాలను చర్చించినట్లు శుక్రవారం తెలిపారు. కుమార్ మాట్లాడుతూ ప్రయాణికులు నుంచి వచ్చిన ఫిర్యాదులను డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. గుంటూరు నుంచి వచ్చే పాస్ట్ ప్యాసింజర్ ఆలస్యంపై, పాలకొల్లు రైల్వే గేటు వద్ద రోడ్ అండర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయడంపై డీఆర్ఎంను కోరామన్నారు. డీఆర్ఎం దృష్టిలో పెట్టిన సమస్యలన్నిటినీ పరిశీలన చేసి అతి త్వరలో వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నట్లు తెలిపారు.

తాటాకిల్లు దగ్ధం

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో సికిలే భాస్కరరావు, సికిలే ప్రసాద్‌లకు చెందిన తాటికిల్లు అగ్నికి ఆహుతవ్వడంతో ఆ రెండు కుటుంబాలకు చెందిన వారంతా నిరాశ్రయులయ్యారు. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంతో గ్రామంలోని బైనపాలెం సెంటర్‌లోఉన్న రెండు పోర్షన్‌ల తాటాకుల ఇళ్లు అగ్నికి ఆహుతైంది. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. కట్టుబట్టలతో మిగిలిన ఆ కుటుంబాలను చూసి గ్రామస్తులు పలువురు సహకారాన్ని అందించారు. అగ్ని ప్రమాదం వల్ల లక్షా యాభై వేలు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. తహశీల్దార్‌కు సమాచారం అందించి పూర్తి నివేదికను అందజేసినట్లు వీఆర్వో వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ గుబ్బల యమునా భాను, ఎంపీటీసీ సభ్యుడు సంగాని బాబూరావు, సంగాని లక్ష్మణ రావు తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

లేగ దూడల ప్రదర్శన

పాలకొల్లు అర్బన్: చింతపర్రులో లేగదూడల ప్రదర్శన అందాల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో కట్టా సూర్యనారాయణ (చింతపర్రు), తాళం పెద్దిరాజు (చింతపర్రు), సానబోయిన మంగతాయారు (సగంచెరువు) రైతులకు చెందిన లేగ దూడలు వరుస బహుమతులు గెలుపొందాయి. సగంచెరువు, ఆగర్రు, ఆగర్తిపాలెం, అరట్లకట్ట, వెంకటాపురం, కాపవరం, చింతపర్రు, భగ్గేశ్వరం గ్రామాల నుంచి ఏడాది లోపు వయస్సుగల 32 లేగ దూడలు ప్రదర్శనలో పాల్గొన్నాయి. పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.కె మురళీకృష్ణ, భీమవరం ఉప సంచాలకులు డా. జె హుస్సేన్, డా. జి. జేసురత్నం, డా. రామశేఖర్, డా.ఎన్‌వీఎస్ విజయశ్రీ, డా. డి మాధురి, డా. పి చంద్రశేఖర్‌రెడ్డి, వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 28వ తేదీ ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ శుక్రవారం విలేకరులకు చెప్పారు. సభ్యులు విధిగా పాల్గొనాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం నిరసన


పెనుగొండలో తహసీల్దారుకు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన బడ్జెట్ సామాన్య ప్రజల నడ్డివిరిచే విధంగా ఉందని సీపీఎం నాయకుడు షేక్ పాదుషా విమర్శించారు. శుక్రవారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద నిరశన వ్యక్తం చేసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుర్రాల సత్యనారాయణ, నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరావు, కప్పల రత్నరాజు, గెద్దాడ శ్రీనివాస్, నీలం ఏసులు పాల్గొన్నారు.

ఆచంటలో

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేయడంతో పాటు, పేదల నడ్డివిరిచే విధంగా ఉందంటూ సీపీఎం నాయకులు ఆచంట తహసీల్దారు కార్యాలయం వద్ద నిరశన వ్యక్తం చేసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్, సిర్రా నరసింహమూర్తి, మచ్చ సుబ్బారావు, ఇందుకూరి సూర్యనారాయణ రాజు, తోటపల్లి సత్యనారాయణ, కుసుమే జయరాజు, రాయపాటి మధు కిరణ్, వీరయ్య, కె.రాజు నరసింహమూర్తి పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు విమర్శించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో ముచ్చర్ల త్రిమూర్తులు, బూడిద జోగేశ్వరరావు, జల్లి రామ్మోహన్ రావు, బొక్కా శ్రీనివాసరావు, మంచిలి నీలకంఠం, పాగాకు నారాయణరావు పాల్గొన్నారు.

28న మెగా జాబ్ మేళా

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం, కాకినాడ వికాస వారి సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 28న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ ఏనుగుపల్లి శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు 20కి పైగా ప్రముఖ కంపెనీలు హాజరవుతున్నట్లు తెలిపారు. సుమారు 1190 మంది ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. పది, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, బీ.టెక్ విద్యార్హత ఉన్న వాళ్లు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల లోపు బయోడేటా, ఆధార్ జిరాక్స్‌తో కళాశాల ఆవరణలో జరిగే ఇంటర్వ్యూకి హాజరుకావాలని వారు కోరారు. మరిన్ని వివరాలకు 98669 44396కు ఫోన్ చేయాలని సూచించారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వడ్డీల సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్: బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అత్యంత గుర్తింపు లభించిందని పాలకొల్లు నియోజకవర్గ వడ్డీల సంఘ ప్రధాన కార్యదర్శి మోర్త గిరీష్ అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘ నాయకులు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల్లో 14 శాఖలు ఉన్నాయని, వీరిలో బెస్త, వడ్డీలు, మత్స్యకారులు, వాడబలిజ కులాలకు చెందిన నలుగురికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో తామంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉంటామన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రాజా కేశవ గాంధీ, ఉపాధ్యక్షుడు చెరుకువాడ మీరా ఫకీర్, నాయకులు రాజా నారాయణ, తీపర్తి నాగశ్రీను, ముంగండ రాధాకృష్ణ, పెంటపాటి కృష్ణ, రాజా తుకారం, పెంటపాటి సూర్యచంద్రరావు, ముంగండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు తవ్వకం పనుల పరిశీలన


రామన్నపాలెంలో చెరువు తవ్వకం పనులను పరిశీలిస్తున్న దృశ్యం

మొగల్తూరు: అమృత్ సరోవర్ పథకంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చెరువులను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రామన్నపాలెం పంచాయతీలోని ఉప్పు చెరువును అభివృద్ధి చేసే పనులు చేపట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా అమృత్ సరోవర్ పథకంలో రూ.3.80 లక్షలతో చేపట్టిన స్థానిక బోది చెరువులో పనులను శుక్రవారం ఏపీఎం శ్రీనివాస్ పరిశీలించారు. మట్టి పూడిక తీయడం, గట్లు వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి గట్లును అభివృద్ధి చేసి మొక్కలు నాటడంతో పాటు స్థానికులు వినియోగించుకునేలా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. వర్షాకాలం ముందు తర్వాత కూడా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎలుకల నిర్మూలనతో దిగుబడి పెంపు


సీతారాంపురం నార్త్‌లో ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై అవగాహనను కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు

నరసాపురం రూరల్: వరిలొ పంటకాలమంతా నష్టాన్ని కలుగజేసే ఎలుకలను సమర్థవంతంగా నివారించాలంటే ఎలుకల నిర్మూలనా కార్యక్రమాన్ని సామూహికంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరావు అన్నారు. సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమంలో భాగంగా నరసాపురం మండలం సీతారామపురంనార్త్ గ్రామంలోని చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా రైతులతో కలిసి పొలాల గట్లు చుట్టూ ఉన్న ఎలుక కన్నాలను గుర్తించి మట్టితొ పూడ్చిపెట్టే కార్యక్రమం చేపట్టారు. శనివారం తెరుచుకున్న ఎరుకల బొరియలను గుర్తించి వాటివద్ద బ్రొమోడయోలిన్ విషపు ఎర మందును 10 గ్రాముల పొట్లాలుగా కట్టి అక్కడ ఉంచాలన్నారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని రైతాంగం అంతా కలిసి ఈ కార్యక్రమాన్ని సామూహికంగా చేపడుతుందన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ రాజేష్, డాక్టర్ వినయలక్ష్మి తదితరులు పాల్గొని కలుపు యాజమాన్యం, పంటలో ఆశించే చీడపీడల నివారణ చర్యలు గూర్చి రైతులకు వివరించారు. ఏడీఏ ఈదా అనిల్ కుమారి మాట్లాడుతూ సామూహిక ఎలుకల నిర్మూలనకు రైతులంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పులపర్తి ప్రతాప్, వ్యవసాయశాఖ, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు ముత్యాలరావు, కత్తుల బాబూరావు, ప్రభుదాసు, కాసా ఏసు, చినమిల్లి కృష్ణమూర్తి తదితర రైతులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనతో రైతులకు మేలు

యలమంచిలి: సామూహిక ఎలుకల నిర్మూలనతో రైతులకు మేలు జరుగుతుందని, ఈ కార్యక్రమం విజయవంతానికి రైతులంతా సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి జగబాతుని వెంకటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన శిరగాలపల్లి గ్రామంలో రైతులతో తమ చేల గట్ల వద్ద ఉన్న ఎలుకల బొరియలను గుర్తించి మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 96 గ్రాముల నూకలలో రెండు గ్రాముల బ్రొమోడయోలిన్, రెండు గ్రాముల నూనె కలిపితే 100 గ్రాముల ఎలుకల నివారణ మందు తయారు అవుతుందన్నారు. మండలంలో ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద శనివారం వ్యవసాయ సిబ్బంది రైతులకు ఈ విధంగా తయారు చేసిన బ్రొమోడయోలిన్ మందును పంపిణీ చేస్తారన్నారు. ఆ మందును రైతులు తమ చేల గట్లకు తీసుకెళ్లి ముందు రోజు మూసివేసిన బొరియలను పరిశీలించి వాటిలో ఏ బొరియలయితే తెరిచి ఉన్నాయో ఆ బొరియల్లో ఎలుకలు ఉన్నట్లు గుర్తించి ఆ బొరియల వద్ద 10 గ్రాముల బ్రొమోడయోలిన్ మందును పెట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో శిరగాలపల్లి సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిలుకూరి మురళీకృష్ణ, నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిల్‌కుమారి, మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, సొసైటీ సీఈఓ వేముల సుబ్రహ్మణ్యం, గ్రామ వ్యవసాయ సహాయకులు మల్లుల చైతన్య, కాండ్రేకుల నాగలక్ష్మి, సీహెచ్ ఎల్‌డీ గణేష్, ఇబ్రహీం రైతులు వెంకట నారా యణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: ఎలుకల నిర్మూలనకు రైతులంతా సామూహికంగా కృషి చేయాలని డివిజనల్ వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం మొగల్తూరు2 సచివాలయ పరిధిలోని రైతులతో సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ అనిల్ కుమారి, ఎంఏవో ఎం.సుజాత, రైతులు కటికిరెడ్డి సత్యనారాయణ, మాణిక్యాలరావు, తులసి రావు, తదితరులు పాల్గొన్నారు.

వడ్లవానిపాలెంలో..

పాలకొల్లు అర్బన్: రైతులంతా ఏకకాలంలో సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు మండలంలో శుక్రవారం సామూహిక ఎలుకల నిర్మూలనలో ఎలుక కన్నాలను మూయించారు. శుక్రవారం నూకలు, బ్రొమోడయోలిన్ కలిపిన మందును అందజేస్తారని ఈ మందును తెరచి ఉన్న కన్నాల్లో ఉంచి మూసివేయాలని సూచించారు. వడ్లవానిపాలెం గ్రామంలో రైతులతో ఆయన దగ్గరుండి కన్నాలను మూయించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు షేక్ అబ్దుల్ రహీం, కాళీ మాత, వడ్లవానిపాలెం సర్పంచ్ పెన్మెత్స పద్మ, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెన్మెత్స ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

తాళాబత్తులకు ఉత్తమ రంగస్థల పురస్కారం

పోడూరు: ప్రముఖ నాటిక రచయిత, రంగస్థల నటుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు నాటిక రచన విభాగంలో ఉత్తమ రంగస్థల పురస్కారాన్ని అందుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' సంస్థ, ఏపీ సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల రాజమండ్రిలో నిర్వహించిన భారత్ రంగ్ మహోత్సవ కార్యక్రమంలో తాళాబత్తుల అవార్డు స్వీకరించారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామానికి చెందిన తాళాబత్తుల ప్రభుత్వోపాధ్యాయుడిగా పనిచేస్తూనే అనేక నాటికలు రచించారు. తాళాబత్తుల తాజాగా రంగస్థల పురస్కారం అందుకోవడం పట్ల స్థానిక జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, గ్రామసర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు, ఉపసర్పంచ్ దండు వెంకట గోపాలకృష్ణంరాజు, ఏఎంసీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు అభినందనలు తెలిపారు.

అమ్మవారికి సారె సమర్పణ

నల్లజర్ల: పెనుగొండలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఆర్యవైశ్య మహిళలు శుక్రవారం భారీ సారె సమర్పించారు. నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన ఆర్యవైశ్య మహిళా సంఘ సభ్యులు దాదాపు 25 మంది 108 రకాల పిండి వంటలు (స్వీట్స్) తయారు చేశారు. ఆ సారెతో పెనుగొండ వెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమయమంతుల సీతామహాలక్ష్మి, ఉ ఉద్దగిరి సుబ్బలక్ష్మి, ఉద్దగిరి శిరీష, వల్లాల సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు


ఆచంటలో గడపగడపకూ మన ప్రభుత్వంలో సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రాభివృద్ధి జరగకుండా ఆటంకం కల్పిస్తూ చంద్రబాబు చేస్తున్న దుష్ట యత్నాలనుప్రజలు గమనిస్తున్నారని, ప్రజలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం ఆచంటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి పేదలకు అందిన లబ్ధిని వివరించారు. ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తూనే, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహర్నిశలు కృషి చేస్తుంటే చంద్రబాబు, వారి పచ్చమీడియా దుష్ప్రచారం చేస్తూ రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రజలకు సంక్షేమం ప్రకటిస్తున్న ప్రతీ సారీ చంద్రబాబు ఇదే రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులతో పరిశ్రమలను తీసుకు వస్తుంటే, వాటిని వెనక్కి పంపడానికి చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు పన్నినా, మభ్యపెట్టడానికి ప్రయత్నించినా ప్రజలు చంద్రబాబుకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, మాజీ ఎంపీపీ మట్టా ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ తప్పెట్ల విజయకుమారి వెంకట్రావు, ఉప సర్పంచ్ అద్దాల పెద్దిరాజు, కప్పల భారతి, గొట్టి ముక్కల మరియమ్మ, గురుజుకోట రాజ్యలక్ష్మి, మెండే శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, కుక్కల కిరణ్, వేమన అప్పారావు పాల్గొన్నారు.